

మందలో ఒకరిగా ఉండకు
వందలో ఒకరిగా ఉండటానికి
ప్రయత్నించు


Dr.PRK **పవర్**

పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ళు తప్ప



**రామకృష్ణ హాస్పిటల్స్**

పక్షవాతం, డిస్క్ సమస్యలు,
నడుమునొప్పి
మెడ నొప్పులకు
పూర్తి చికిత్స కలదు.
నిరుపేదలకు ఉచిత వైద్యం



**రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్**

విజయ టాకీస్ దగ్గర, హనుమాన్ టెంపుల్ లైన్, హనుమకొండ
సెల్: 9849485100



సంపుటి : 01 సంచిక : 338 | బుధవారం 9 సెప్టెంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 4


# మోదీ వేదిక వద్ద తుపాకీ కలకలం

**ఇద్దరు నిందితులు అరెస్టు**

**మోదీ ముంబయి పర్యటన నేపథ్యంలో కీలక పరిణామం**

**ప్రధాని పాల్గొనే వేదిక వద్ద నకిలీ పీఎంఓ ఐడీ కార్డు ఉన్న వ్యక్తి, సాయుధుడు అరెస్టు**

**దర్యాప్తు చేపట్టిన ముంబయి క్రైమ్‌బ్రాంచ్ అధికారులు**



**న్యూఢిల్లీ, పవర్ న్యూస్**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముంబయి పర్యటన నేపథ్యంలో కీలక పరిణామం జరిగింది. మోదీ పాల్గొనే కార్యక్రమం వేదిక వద్ద అనుమానస్పందంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నకిలీ పీఎంఓ ఐడీ కార్డు, ఒక తుపాకిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో ప్రధాని రాకకు ముందే ముంబయిలో హై అలర్ట్ ప్రకటించారు. సోమవారం రాత్రి భద్రతా దళాలు ప్రోటోకాల్ డ్రిల్ నిర్వహిస్తుండగా ఈ ఘటన జరిగింది. మంగళవారం సాయంత్రం ముంబయిలోని బాంద్రా-కుర్లా కాంప్లెక్స్(బీకేసీ) ప్రాంతంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ పాల్గొనాల్సి ఉంది. అయితే,

..మిగతా 2లో

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు
# తాతా మధు, నవీన్ సస్పెన్షన్





**బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై చర్యలు తీసుకోవాలని శాసనసభలో తీర్మానం**

**తీర్మానాన్ని ప్రవేశపెట్టిన మంత్రి దామోదర రాజనర్సింహ**

**స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే ఇందుకు కారణం**

**కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని తీర్మానంలో డిమాండ్**

**హైదరాబాద్, పవర్ న్యూస్**

తెలంగాణ రాజకీయాల్లో అసెంబ్లీ ఆవరణలో చోటుచేసుకున్న వివాదం మరో కీలక మలుపు తిరిగింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై శాసనమండలి సస్పెన్షన్ వేటు వేసింది. ప్రస్తుత వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు ఇద్దరినీ మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు శాసనమండలిలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తర్వాత శాసనమండలి ఛైర్మన్ మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. తీర్మానానికి ఆమోదం లభించిన తర్వాత తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిని ప్రస్తుత సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత మండలి సమావేశాన్ని వాయిదా వేశారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యల వ్యవహారాన్ని శాసనసభ కూడా తీవ్రంగా పరిగణించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ తీర్మానం చేసింది. తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టారు. స్పీకర్ పదవికి గౌరవం తగ్గించేలా వ్యాఖ్యలు చేయడాన్ని శాసనసభ ఖండించింది. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. మహిళల ఎదుట అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలను కూడా సభ ఖండించింది. బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తనకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత వహించాలని, స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని తీర్మానంలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని శాసనమండలి ఛైర్మన్‌కు పంపించారు. దీనిపై మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు మరో తీర్మానం ప్రవేశపెట్టగా మూజువాణి ఓటింగ్ అనంతరం ఇద్దరు ఎమ్మెల్సీలపై

..మిగతా 2లో



## కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్తుండగా
# కేటీఆర్ అరెస్ట్

**ప్రజాస్వామ్యం పరిహాసమవుతోందంటూ ఆగ్రహం**

**ప్రజాస్వామ్యం ఎన్ని రకాలుగా పరిహాసమవుతుందో ప్రజలు గమనిస్తున్నారన్న కేటీఆర్**

**ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి వెయ్యి రోజులైందని విమర్శ**

**హైదరాబాద్, పవర్ న్యూస్**

ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసం వద్ద కాంగ్రెస్ నిరసనలకు ప్రతిగా బీఆర్ఎస్ చేపట్టిన ఆందోళన, పరిస్థితిని మరింత వేడెక్కించింది. అసెంబ్లీ నుంచి ఎర్రవల్లి బయలుదేరిన కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. కేటీఆర్‌ను బోయినపల్లి, హరీశ్‌రావును జవహర్‌నగర్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. అక్కడకు బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావడంతో బోయిన్‌పల్లి స్టేషన్ వద్ద ఇరువర్గాలకు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. రాళ్లు రువ్వుకోవడంతో ఉద్రిక్తతలకు దారితీసింది. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసం వద్ద కాంగ్రెస్ నిరసనలపై బీఆర్ఎస్ తీవ్రస్థాయిలో మండిపడింది. ఫామ్‌హౌస్ వద్ద పరిణామాలతో కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి ఎర్రవల్లికి బయల్దేరారు. బొల్లారం వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్నారు. హకీంపేట

..మిగతా 2లో

# హౌస్ అరెస్ట్ అక్రమం - దళితుల హక్కులను హరించవద్దు

**డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ**

**(హనుమకొండ -- పవర్):**



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణను సుబేదారి పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.నిన్న అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు గౌరవ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారిపై చేసిన అనుచిత, దుర్భాషల వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పోలీసులు హౌస్ అరెస్టుల పేరుతో అడ్డుకోవడం సరికాదన్నారు.బహిరంగ క్షమాపణ చెప్పాలి: బీఆర్ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ గారు దళిత సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, లేకపోతే ప్రజాస్వామ్య పద్ధతుల్లో తీవ్ర స్థాయిలో నిరసనలు చేపడతామని డాక్టర్ రామకృష్ణ హెచ్చరించారు.ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలి: తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని, బీఆర్ఎస్ పార్టీ వెంటనే ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తాతా మధుపై పార్టీ కఠిన చర్యలు తీసుకున్నప్పుడే దళిత సమాజంలో బీఆర్ఎస్‌పై నమ్మకం ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు.రాజ్యాంగ హక్కుల పరిరక్షణ: లేనిపక్షంలో దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ప్రజాస్వామ్య పద్ధతుల్లో తీవ్రంగా వ్యతిరేకిస్తూ, బీఆర్ఎస్ పార్టీని రాజకీయంగా గట్టిగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులను హరించే ప్రయత్నాలను సహించబోమని, దళితులు, పేదలు, అణగారిన వర్గాలకు ఎక్కడ అన్యాయం జరిగినా వారి తరఫున నిలబడి పోరాడుతామని స్పష్టం చేశారు.



## కేబినెట్ విస్తరణ ఊహాగానాలపై
# మహేశ్ గౌడ్ స్పందన

**మంత్రుల శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా.. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్**

**పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై సూచనలు చేశానని వెల్లడి**

**తనకు మంత్రి పదవి ఇవ్వడం అధిష్ఠానం నిర్ణయమన్న మహేశ్ గౌడ్**

**హైదరాబాద్, పవర్ న్యూస్**

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ...

..మిగతా 2లో

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్తుండగా కేటీఆర్ అరెస్ట్

**మొదటి పేజీ తరువాయి...**

వద్ద కేటీఆర్, హరీశ్‌రావును నిలిపివేశారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

వందల మంది బలగాలు ఉన్నాయి : కేసీఆర్ ఇంటిపైకి కాంగ్రెస్ శ్రేణులను తీసుకుపోవాలని సూచనలు ఉన్నాయా అని పోలీసులను కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ ఇంటి వైపు ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని పోలీసు ఉన్నతాధికారులు కేటీఆర్‌కు తెలిపారు. ఫామ్‌హౌస్ వద్ద వందల మంది బలగాలు ఉన్నాయని పోలీసులు చెప్పారు. అయితే ఎస్కార్ట్, రోప్ పార్టీలను ఇచ్చి తీసుకుపోతున్నారంటూ ఓ వీడియోను కేటీఆర్ పోలీసులకు చూపించారు. కాంగ్రెస్ వారిని కూడా అటువైపు వెళ్లకుండా పోలీసులు ఆపాలని సూచించారు. అయినప్పటికీ పోలీసులు అనుమతించకపోవడంతో కేటీఆర్, హరీశ్‌రావు బొల్లారం చౌరస్తా నుంచి ఎర్రవల్లికి పాదయాత్రగా బయల్దేరారు. దీంతో వారిని అరెస్ట్ చేసి, కేటీఆర్‌ను బోయిన్‌పల్లి, హరీశ్‌రావును జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు.

12 పైసలు ఇవ్వలేదు : దళితులపై ప్రేమ ఉంటే గిరిజన డిక్లరేషన్ హామీలు అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. దళితబంధు రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి 12 పైసలు ఇవ్వలేదని విమర్శించారు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఎస్సీ, ఎస్టీలకు 30 శాతం వాటా ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు.

"కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను దూషించేందుకు ఒక రోజంతా సభ పెట్టండి. మిగిలిన వారం రోజులైనా ప్రజా సమస్యలపై మాట్లాడుదాం. ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి వెయ్యి రోజులైంది. అన్ని వర్గాలు అసంతృప్తితో ఉన్నాయి. ప్రభుత్వ హామీలు, ఆరు గ్యారంటీలపై సభలో చర్చిద్దాం. దళిత స్పీకర్ అని సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడాలేని ప్రేమ కురిపిస్తున్నారు" – కేటీఆర్, మాజీ మంత్రి

ఈ క్రమంలోనే కేటీఆర్‌తోపాటు బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేసి ఉంచిన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ ఆవరణ తీవ్ర ఉద్రిక్తతకు వేదికైంది. గులాబీ శ్రేణులు భారీ సంఖ్యలో పీఎస్ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. అదే సమయంలో కాంగ్రెస్ శ్రేణులు కూడా అక్కడకు రావడంతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. ఇరు పార్టీల కార్యకర్తలు తీవ్రస్థాయిలో నినాదాలు చేసుకుంటూ ఘర్షణకు దిగారు. ఆగ్రహంతో రగిలిపోయిన బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు పోలీస్ స్టేషన్ ముందే కుర్చీలు, రాళ్లతో పరస్పరం దాడి చేసుకున్నారు.

సబిత గొంతు పిసికితే రేవంత్ రెడ్డికి కనపడలేదా : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. సభలో సమస్యలు చర్చించకుండా రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. సబితా ఇంద్రారెడ్డి గొంతు పిసికితే రేవంత్ రెడ్డికి కనపడలేదని, మహిళ ఎమ్మెల్యేలు ఫిర్యాదు ఇస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలు ఏమనుకుంటారోనన్న జ్ఞానం లేదా అని నిలదీశారు. ఘాటు వ్యాఖ్యలు చేసిన హరీశ్‌రావు : రేవంత్ రెడ్డి కలియుగ దుశ్శాసనుడు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కౌరవులకు పట్టిన గతి కాంగ్రెస్‌కు పడుతుందని హరీశ్ వ్యాఖ్యానించారు. బీజేపీ సభ్యులు ప్లకార్డులతో అసెంబ్లీలోకి వెళ్లారన్న హరీశ్, దీన్నిబట్టే బడే భాయ్ చోటే భాయ్ బంధం అర్థం అవుతోందన్నారు. సీఎం చేతకాని తనం వల్ల క్రాప్ హాలిడే ఇచ్చే పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడతామని స్పష్టంచేశారు.



## ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ సస్పెన్షన్

**మొదటి పేజీ తరువాయి...**

సస్పెన్షన్ నిర్ణయం వెలువడింది. అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనకు సంబంధించి తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకుని విచారించిన తర్వాత కోర్టులో హాజరుపరిచారు. అయితే నాంపల్లి కోర్టు పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తిరస్కరించింది. వ్యక్తిగత పూచీకత్తుతో విడుదల చేయాలని ఆదేశిస్తూ ఒక్కొక్కరు రూ.10 వేల పూచీకత్తుతో పాటు రెండు షఉ్యరిటీలు సమర్పించాలని సూచించింది. కోర్టు ఆదేశాల మేరకు షఉ్యరిటీలు సమర్పించిన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు విడుదలయ్యారు. కోర్టు నుంచి విడుదలైన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలు శాసనమండలికి హాజరయ్యారు. వారు సభలోకి రావడంపై అధికారపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాతా మధు, నవీన్ రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మధ్యే సస్పెన్షన్ తీర్మానం మండలి ముందుకు వచ్చింది. తమ పార్టీ ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి ఆవరణలో ఆందోళన చేపట్టారు. సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బైఠాయించారు. ప్రభుత్వం తమ పార్టీ నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

## మోదీ వేదిక వద్ద తుపాకీ కలకలం

**మొదటి పేజీ తరువాయి...**

వేదిక వద్ద ప్రధాన మంత్రి కార్యాలయానికి చెందిన అధికారిగా చెప్పుకుంటూ తిరుగుతున్న వ్యక్తులు బీకేసీలోని నీతా ముఖేశ్ అంబానీ కల్చరల్ సెంటర్‌లోకి ప్రవేశించారు. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న భద్రతా సిబ్బంది వారిద్దరి అనుమానాస్పద ప్రవర్తనను గమనించి అడ్డుకున్నారు. వారివద్ద ఉన్న ఐడీ కార్డులను తనిఖీ చేసి నకిలీవని గుర్తించారు. అనంతరం వారిద్దరిని ముంబయి పోలీసులకు అప్పగించారు. అనుమానితుడిని రోహన్ పరేఖ్‌గా పోలీసులు గుర్తించారు.

**'షాపింగ్ మాల్ ఘటనకు మోదీ ఈవెంట్‌కు సంబంధం లేదు'**

ఇదిలా ఉండగా, ముంబయిలో బీకేసీలో ఉన్న ఒక షాపింగ్ మాల్‌లోకి తుపాకీతో ప్రవేశించడానికి ప్రయత్నించిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. అయితే, ఆ ఘటన సోమవారమే బీకేసీలోని 'జియో వరల్డ్ ప్లాజా'లో జరిగిందని, దీనికి ప్రధాని కార్యక్రమంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఓ అధికారి తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం షాపింగ్ ప్లాజాలో ఉన్న ఓ షాపింగ్ మాల్‌లోకి గుర్తుతెలియని ముగ్గురు అనుమానితులు ప్రవేశించడానికి యత్నించారు. భద్రతా సిబ్బంది వారిని అడ్డుకోగా, వారు అనుమానాస్పదంగా ఉన్న ప్రభుత్వ గుర్తింపు కార్డును చూపించి, గార్డులతో వాదించి, బలవంతంగా లోపలికి వెళ్లారు. ఆ సమయంలో అక్కడే ఉన్న మాల్ సెక్యూరిటీని తుపాకీ చూపించి బీకేసీలోని జియో వరల్డ్ ప్లాజాలోకి బలవంతంగా ప్రవేశించారు. అనంతరం విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నిందితులను అరెస్టు చేశారు. అయితే, నిందితుల వద్ద లభించిన ఆయుధానికి లైసెన్స్ ఉన్నట్లు తేలిందని, ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకోవడానికి దర్యాప్తును ముమ్మరం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

## కేబినెట్ విస్తరణ ఊహాగానాలపై మహేశ్ గౌడ్ స్పందన

**మొదటి పేజీ తరువాయి...**

ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ సమూలంగా పునర్వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు స్పష్టమైన సూచన చేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పరిధి మేరకు పార్టీ ప్రయోజనాల కోసం ఈ సలహా ఇచ్చానని... దానిపై తుది నిర్ణయం తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధిష్ఠానం చేతిలోనే ఉందన్నారు. ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై స్పందిస్తూ... ఆ విషయాలన్నీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని తెలిపారు. ప్రస్తుతం పార్టీని బలోపేతం చేసే బాధ్యత కలిగిన పీసీసీ అధ్యక్షుడిగా నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు.

## జరిమానాల బాదుడు: సామాన్యుడిపై మోత.. ప్రభుత్వ వాహనాలకి మినహాయింపులా?

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 8**

రోడ్డు నిబంధనల పేరుతో రవాణా శాఖ అధికారులు సామాన్యుల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ, భారీ జరిమానాలతో చెలగాటమాడుతున్నారని డ్రైవర్ల అసోసియేషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. వాహనానికి ఎల్ఈడీ లైట్ అమర్చుకున్నారనే నెపంతో ఏకంగా ₹5,000 జరిమానా విధించడంపై డ్రైవర్లు, వాహనదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణ రవాణా శాఖ అధికారిక ప్రాసిక్యూషన్ జాబితా ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా వాహనాల్లో మార్పులు చేయడం లేదా రోడ్డు భద్రతా ప్రమాణాల ఉల్లంఘనలపై వేర్వేరు సెక్షన్లు, నిబంధనలు ఉన్నప్పటికీ... ప్రతీ సందర్భంలోనూ ఎల్ఈడీ లైట్లకు ఒకే రీతిగా ₹5,000 వసూలు చేయడం వెనుక గల చట్టబద్ధతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వ వాహనాలకు ఒక న్యాయం.. సామాన్యుడికి మరొకటా?అధికారులు, డిపార్ట్‌మెంట్ వాహనాల్లో ఎల్ఈడీ లైట్లను నిరభ్యంతరంగా ఉపయోగిస్తున్నప్పుడు, అదే లైట్లు వేసుకున్న ప్రైవేటు వాహనాలపై మాత్రం తక్షణమే చలానాలు విధిస్తుండటంపై డ్రైవర్ల సంఘాలు నిలదీస్తున్నాయి. అత్యవసర సేవలు, ప్రభుత్వ వాహనాలకు ప్రత్యేక నిబంధనలు ఉన్నప్పటికీ, కేవలం సామాన్యులనే లక్ష్యంగా చేసుకుని భారీ చలానాలు విధించడం ఏమాత్రం సమంజసం కాదని వారు మండిపడుతున్నారు.

**చెల్లుబాటు అయ్యే సెక్షన్లపై స్పష్టత ఏది?**

వాహనం (కారు, బొలెరో, ట్రావెలర్) ఏ రకమైనది? ఎల్ఈడీ లైటును ఎక్కడ అమర్చారు (ముందు భాగం, పైకప్పు లేదా లోపల) ? అది ఫ్లాషింగ్ బీకన్ లైటా లేక అదనపు వెలుగు కోసం వేసుకున్న సాధారణ లైటా? అనే విషయాలను సరిగ్గా పరిశీలించకుండానే రూ. 5,000 జరిమానాలు వేస్తున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు వర్తించే చట్టబద్ధమైన సెక్షన్లు, ఆఫెన్స్ కోడ్‌లను పారదర్శకంగా వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.

**అధికారులు స్పందించాలి: డ్రైవర్ల అసోసియేషన్ డిమాండ్**

జోగులాంబ గద్వాల జిల్లా రవాణా కార్యాలయంలో అధికారికంగా నమోదైన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (వీఎ×) =. రాధిక మరియు ఉన్నతాధికారులు ఈ జరిమానాల విధింపుపై తక్షణమే స్పష్టత ఇవ్వాలని డ్రైవర్ల అసోసియేషన్ కోరుతోంది. రూల్స్ పేరుతో పేద, మధ్యతరగతి డ్రైవర్ల జీవితాలతో, ఉపాధితో చెలగాటం ఆడవద్దని, నిబంధనల ప్రకారం చలాన్ల కాపీల్లో సరైన సెక్షన్లు పొందుపరచడంతో పాటు అప్పీల్ చేసుకునేందుకు అవకాశాలు కల్పించాలని గద్వాల జిల్లా డ్రైవర్ల సంఘం డిమాండ్ చేస్తోంది.

## ఇందిరమ్మ ఇళ్లు రాని వారికి ఊరట..

**రూ.10 వేల డిపాజిట్ వెనక్కి**
**లాటరీలో ఇళ్లు రాని వారికి డిపాజిట్ల వాపసు**
**ఆన్‌లైన్‌లో చెల్లించిన వారికి నేరుగా ఖాతాల్లోకి జమ**
**మీ–సేవలో నగదు ఇచ్చిన వారు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి**
**నగదు చెల్లింపుదారులు దరఖాస్తుకు సెప్టెంబరు 10వ తేదీ ఆఖరు**
**4 నియోజకవర్గాల్లో కొత్త దరఖాస్తులకు కూడా 10వ తేదీనే తుది గడువు**



**హైదరాబాద్, పవర్ న్యూస్**

ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ పథకంపై హౌసింగ్ బోర్డు కీలక ప్రకటన చేసింది. లాటరీలో ఇళ్లు దక్కించుకోని దరఖాస్తుదారులకు వారు చెల్లించిన ధరావతు (ఈఎండీ) మొత్తాన్ని బుధవారం నుంచి తిరిగి చెల్లించనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతమ్ తెలిపారు. ఈ వాపసు ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి నుంచి హౌసింగ్ బోర్డు రూ.10 వేలను ఈఎండీగా స్వీకరించింది. ఆన్‌లైన్ ద్వారా ఈ మొత్తాన్ని చెల్లించిన వారు డబ్బుల వాపసు కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని గౌతమ్ స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు ఏ బ్యాంకు ఖాతా నుంచి డబ్బు చెల్లించారో, తిరిగి అదే ఖాతాకు జమ చేస్తామని వివరించారు. అయితే, కొందరు మీ–సేవ కేంద్రాల్లో నగదు రూపంలో చెల్లించినట్లు గుర్తించామని, వారు మాత్రం డబ్బు వాపసు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

## ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 8**

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి నిరంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మంగళవారంరాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను సందర్శించి త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్‌లో భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్లు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఇతర ఎన్నికల సామగ్రి మరియు వాటిని భద్రపరిచిన గదులను కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని భద్రంగా భద్రపరుస్తున్న విధానాన్ని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు తదితర ఎన్నికల సామగ్రికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోడౌన్‌లో భద్రపరిచిన యంత్రాల సంఖ్య, వాటి భద్రత, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈవీఎంలు మరియు ఎన్నికల సామగ్రి విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గోడౌన్ భద్రత, సీసీటీవీ పర్యవేక్షణ, సీల్ విధానం, రిజిస్టర్ల నిర్వహణ వంటి అంశాలను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.త్రైమాసిక తనిఖీలో భాగంగా జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్ సీల్‌ను తెరిచి, భద్రపరిచిన ఈవీఎంలు మరియు ఇతర ఎన్నికల సామగ్రిని పరిశీలించారు. తనిఖీ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఎన్నికల నిబంధనల ప్రకారం గోడౌన్‌కు తిరిగి సీల్ వేయించారు. మొత్తం ప్రక్రియ పారదర్శకంగా, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించబడింది. ఎస్ ఐ ఆర్ హియరింగ్ ప్రక్రియ పరిశీలన




అనంతరం రాజేంద్రనగర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్) హియరింగ్(ఎస్ ఐ ఆర్) హియరింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు.హియరింగ్‌కు హాజరవుతున్న ప్రజలతో మాట్లాడి, వారి దరఖాస్తులు మరియు సమర్పిస్తున్న పత్రాల వివరాలను తెలుసుకున్నారు. హియరింగ్ సమయంలో ప్రజలు అవసరమైన పత్రాలను సక్రమంగా సమర్పించేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

హియరింగ్ ప్రక్రియను ఎన్నికల నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హియరింగ్‌కు వచ్చే ప్రతి దరఖాస్తుదారునికి ప్రక్రియపై స్పష్టమైన సమాచారం అందించి, వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ శ్రీధర్, తహశీల్దార్, వేర్‌హౌస్ ఇన్‌చార్జ్ రాములు, ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర గుప్తా, సంబంధిత అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు ఎన్. ధనుంజయ, బి జె పి నుంచి వై. శ్రీధర్, బి ఆర్ ఎస్ నుంచి వీర్లపల్లి నవీన్ కుమార్, సిపిఐఎం నాయకులు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## జాంపల్లి వద్ద అదుపు తప్పిన ప్రైవేటు స్కూల్ బస్సు

**తప్పిన పెను ప్రమాదం**

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 8**




ధరూర్ మండలం జాంపల్లి గ్రామ శివారులో గద్వాల కు చెందిన ఒక ప్రైవేటు స్కూల్ బస్సు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఆ సమయంలో బస్సులో 60 మందికి పైగా స్కూల్ విద్యార్థులు ఉన్నారు. మంగళవారం ఉదయం కేటిదొడ్డి మండలం నుంచి గద్వాల మండల సంగాలలో గల ఒక ప్రైవేటు స్కూల్ కు విద్యార్థులు తరలిస్తున్న క్రమంలో జాంపల్లి గ్రామ శివారులో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బస్సు స్టీరింగ్ విరగడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని తెలిసింది. అయితే ఫిట్నెస్ లేని బస్సును నడుపుతున్నారని, గతంలో విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ యజామాన్యానికి ఫిర్యాదు చేసిన నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చాల పాత బస్సు కావడంతో పాటు బస్సులో పరిమితికి మించి విద్యార్థులను కూర్చోబెడుతున్నారని తల్లిదండ్రులు పేర్కొన్నారు. స్కూల్ బస్సు జాంపల్లి వద్ద ఉన్న ర్యాలంపాడు కాలువ క్రాస్ చేయంగానే ఈ ప్రమాదం చోటు చేసుకోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. కాలువ రాక ముందే ఈ ఘటన చోటు చేసుకుంటే పరిస్థితి మరోలా ఉండేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేధనకు గురయ్యారు. రవాణ శాఖ అధికారులు లంచాలకు మరిగి ప్రైవేటు స్కూల్ బస్సులకు ఫిట్నెస్ లేకుండా అనుమతులు ఇవ్వడంతోనే ప్రైవేటు స్కూల్ యాజామాన్యం ఇష్టానురాజ్యం అయిందని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఇలాంటి ఘటనలు పునారవృతం కాకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

## పోలీసు ఉద్యోగాలకు ట్రాన్స్‌జెండర్ల దరఖాస్తులు స్వీకరించండి: తెలంగాణ హైకోర్టు

**హైదరాబాద్, పవర్ న్యూస్**



తెలంగాణలో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల నియామక ప్రక్రియలో ట్రాన్స్‌జెండర్లకు అవకాశం కల్పించకపోవడంపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దరఖాస్తు ఫారంలో స్త్రీ, పురుష లింగాలతో పాటు 'ఇతరులు' అనే కాలమ్‌ను ఎందుకు చేర్చలేదని ప్రభుత్వాన్ని, రాష్ట్రస్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డును ప్రశ్నించింది. ట్రాన్స్‌జెండర్ల నుంచి కూడా దరఖాస్తులు స్వీకరించాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు జారీచేసిన నోటిఫికేషన్లలో తమకు అవకాశం కల్పించలేదని సూర్యాపేట జిల్లాకు చెందిన డి.తనుశ్రీ, మరికొందరు ట్రాన్స్‌జెండర్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎల్. రవిచందర్ వాదిస్తూ, అన్ని రంగాల్లో ట్రాన్స్‌జెండర్లకు సమాన అవకాశాలు కల్పించాలని గతంలోనే హైకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు.వాదనలు విన్న ధర్మాసనం, సమాజంలో కేవలం రెండు లింగాలే ఉంటాయన్న మూస ధోరణి నుంచి బయటపడాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. గతంలో హైకోర్టు సీజేగా ఉన్న జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ఇచ్చిన తీర్పు ప్రకారం ప్రభుత్వం ఇప్పటికీ మార్గదర్శకాలు ఎందుకు రూపొందించలేదని నిలదీసింది. దరఖాస్తుల గడువు ఈనెల 16 వరకు ఉందని బోర్డు తరఫు న్యాయవాది తెలపడంతో, ఆన్‌లైన్ పోర్టల్‌లో అవకాశం లేకపోతే భౌతికంగానైనా సరే ట్రాన్స్‌జెండర్ల నుంచి దరఖాస్తులు తీసుకుని, వారికి రశీదు ఇవ్వాలని ధర్మాసనం స్పష్టం చేసింది.ఈ విషయంపై పూర్తి వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ హోంశాఖ, డీజీపీ, పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుతో పాటు దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది.

# ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా 2కె రన్




## డాక్టర్ రామకృష్ణ పెరుమాండ్ల



(హనుమకొండ -- పవర్): ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2ఖ రన్‌ను తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్స్ రాష్ట్ర అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ.. ఫిజియోథెరపీ ద్వారా నొప్పిని తగ్గించడంతో పాటు శరీరంలో తగ్గిన కదలికలను పునరుద్ధరించవచ్చన్నారు. పక్షవాతం, నడుము నొప్పి, మెడ నొప్పి, మోకాళ్ల నొప్పులు, నరాలు మరియు కండరాల బలహీనత, బ్రెయిన్ స్ట్రోక్ వంటి సమస్యల్లో ఫిజియోథెరపీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రస్తుత సెడెంటరీ జీవనశైలి కారణంగా అనారోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి గంటకు కనీసం 2--3 నిమిషాలు శరీరాన్ని కదిలించాలని, ప్రతిరోజూ వ్యాయామం, శారీరక శ్రమకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోడిటెల్లి రాము, వరంగల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ వంశీ, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ క్రాంతి, డాక్టర్ రాకేశ్, డాక్టర్ కీర్తన, డాక్టర్ అజయ్, ఫిజియోథెరపీ అసోసియేషన్ కమిటీ సభ్యులు, విద్యార్థులు, మెడికవర్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధుపై వెంటనే చర్యలు తీసుకోవాలి

**గొర్రెకుంట క్రాస్ రోడ్డులో 15, 17 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా.. పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు అయూబ్**



(వరంగల్ -- పవర్): తెలంగాణ శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ గారిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ 15, 17 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గొర్రెకుంట క్రాస్‌రోడ్డులో సోమవారం భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ మహమ్మద్ అయూబ్ పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తాతా మధు వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ, తెలంగాణ శాసనసభ స్పీకర్ పదవి అత్యున్నత రాజ్యాంగబద్ధమైన పదవి అని, అలాంటి పదవిలో ఉన్న గడ్డం ప్రసాద్ గారిపై తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలను అవమానించే విధంగా ఉన్నాయని అన్నారు. రాజకీయంగా విమర్శలు చేయడంలో తప్పులేదని, అయితే రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తిపై వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. తాతా మధు వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని స్పీకర్ గడ్డం ప్రసాద్ గారికి, తెలంగాణ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో సభాపతి పదవికి ఉన్న గౌరవాన్ని ప్రతి రాజకీయ పార్టీ, ప్రతి ప్రజాప్రతినిధి కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇలాంటి వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 15, 17 డివిజన్ల అధ్యక్షులు కందుల అశోక్, పసునూరి శ్రవణ్, జిల్లా ఉపాధ్యక్షుడు కొమురారెడ్డి, ప్రధాన కార్యదర్శి సంపత్, 15, 17 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు





# రామకృష్ణ హాస్పిటల్‌లో ఘనంగా ఫిజియోథెరపీ డే వేడుకలు

**డాక్టర్ రామకృష్ణ పెరుమాండ్ల**

హనుమకొండ, ఆగస్టు 8: ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామకృష్ణ హాస్పిటల్‌లో ఫిజియోథెరపీ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామకృష్ణ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ రామకృష్ణ పెరుమాండ్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపీ ప్రాముఖ్యత, ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఫిజియోథెరపిస్టుల పాత్రపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపీ రంగంలో సేవలందిస్తున్న వైద్యులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు..

# ప్రజాస్వామ్యంపై యువతకు అవగాహన అవసరం

**VAGMUN, తెలంగాణ స్టేట్ మాక్ అసెంబ్లీలో విష్ణు రెడ్డి**



(వరంగల్ -- పవర్): బొల్లికుంటలోని వాగ్దేవి కళాశాలలో నిర్వహించిన VAGMUN (Vaagdevi Model United Nations), తెలంగాణ స్టేట్ మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి నిర్వాహకుల ఆహ్వానం మేరకు యువ నాయకుడు విష్ణు రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. మోడల్ యునైటెడ్ నేషన్స్, మాక్ అసెంబ్లీ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థపై పూర్తి అవగాహన కల్పిస్తాయని ఆయన తెలిపారు. ప్రజా సమస్యలపై అధ్యయనం చేసి, వాటిపై బాధ్యతాయుతంగా చర్చించడం, భిన్నాభిప్రాయాలను గౌరవించడం వంటి అంశాలను విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే సమాజంలోని సమస్యలపై అవగాహన పెంచుకుని, వాటి పరిష్కారానికి ఆలోచించే దృక్పథాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్యం, ఉపాధి, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత, యువతకు అవకాశాలు వంటి అంశాలపై యువత ఎల్లప్పుడూ చైతన్యంతో ఉండాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన సీఐ బాబులాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులు




(ఆత్మకూర్ -- పవర్): ఆత్మకూర్ పోలీస్ స్టేషన్‌కు నూతన సీఐగా బదిలీపై వచ్చిన బాబులాల్‌ను, బీజేపీ ఆత్మకూర్ మండల అధ్యక్షులు ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షులు బలవంతుల రాజు, మాజీ సర్పంచ్ మరియు మాజీ బీజేపీ మండల అధ్యక్షులు ఇర్సడ్ల సదానందం గార్లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రజలు, పోలీసుల మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం కావాలని బీజేపీ నాయకులు పేర్కొన్నారు.

# అసెంబ్లీ వద్ద ఘటనపై జాతీయ మహిళా కమిషన్‌కు వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ఫిర్యాదు

(హన్మకొండ -- పవర్):
తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణం వద్ద మహిళా పోలీసుల పట్ల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు వ్యవహరించిన తీరుపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సెప్టెంబరు 7న గేట్ నంబర్ 3 వద్ద చోటుచేసుకున్న ఘటనపై జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ)కు ఆమె ఫిర్యాదు చేశారు. మహిళా పోలీసుల గౌరవం, భద్రతకు భంగం కలిగించేలా వ్యవహరించిన వారిపై తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



మహిళా పోలీసుల గౌరవాన్ని కించపరిచేలా బీఆర్ఎస్ నేతల తీరు: రాజకీయ పోరాటం పేరుతో విధుల్లో ఉన్న మహిళా సిబ్బందినే లక్ష్యంగా చేసుకోవడం దారుణమని ఎంపీ మండిపడ్డారు. ప్రజాప్రతినిధులుగా హుందాతనంతో వ్యవహరించాల్సిన వారు నిరసన పేరుతో దురుసుగా ప్రవర్తించడం సరికాదన్నారు.

ఎన్‌సీడబ్ల్యూ సుమోటోగా స్పందించాలి: ఈ ఘటనపై జాతీయ మహిళా కమిషన్ వెంటనే సుమోటోగా స్పందించి, సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సంబంధిత ప్రజాప్రతినిధులను కమిషన్ ఎదుట హాజరుపరచి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విధుల పట్ల అడ్డంకులు -- లబోదిబోమన్న భద్రత: మహిళా పోలీసులను ఉద్దేశించి అసభ్యకర, లింగ వివక్షతో కూడిన వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొందరు బీఆర్ఎస్ నేతలు చొక్కాలు విప్పి బనియన్లతో మహిళా పోలీసులకు సమీపంలో నిలబడటం, భద్రతా వలయాన్ని ఛేదించే ప్రయత్నంలో తోపులాట చోటుచేసుకోవడం తీవ్ర ఆందోళనకరమని వ్యాఖ్యానించారు.

మహిళల ఆత్మగౌరవంతో ఆటలా?: మహిళల గౌరవం, ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే విరుద్ధంగా వ్యవహరిస్తే సమాజానికి ఎలాంటి సందేశం వెళ్తుందని ఎంపీ ప్రశ్నించారు. ఈ ఘటనను రాజకీయ అంశంగా కాకుండా మహిళల గౌరవం, హక్కులకు సంబంధించిన తీవ్రమైన అంశంగా చూడాలని స్పష్టం చేశారు.



## సభాధ్యక్ష స్థానంలో శాసనసభను నడిపించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

(హైదరాబాద్ -- పవర్):
తెలంగాణ రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి శ్రీ కడియం శ్రీహరి గారు ప్యానెల్ స్పీకర్ హోదాలో సభాధ్యక్ష స్థానంలో ఆసీనులై సభను నడిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.?సభ సమర్థవంతంగా సాగేందుకు ప్యానెల్ స్పీకర్‌గా అనుభవజ్ఞుడైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పీకర్ స్థానంలో కూర్చున్నారు. అనంతరం సభలో వివిధ ప్రజాసమస్యలపై జరిగిన చర్చలను ఆయనకు ఉన్న అనుభవంతో చాకచక్యంగా నిర్వహించారు. సభా నియమావళికి కట్టుబడి, ప్రతిపక్ష, అధికార పక్ష సభ్యులకు తగిన సమయాన్ని ఇస్తూ సభను ఎంతో గౌరవప్రదంగా నడిపించారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ గారు బీఆర్ఎస్ నాయకులు తాతా మధు, నవీన్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బీఆర్ఎస్ నాయకుల ప్రవర్తనకు బాధ్యత తీసుకొని కేసీఆర్ క్షమాపణ చెప్పాలని ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.మాజీ మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా, ఎంపీగా ఎన్నో ఏళ్ల సుదీర్ఘ రాజకీయ పరిజ్ఞానం కలిగిన కడియం శ్రీహరి గారు సభాధ్యక్ష హోదాలో చూపిన సామర్థ్యం, క్రమశిక్షణ ఆయన పార్లమెంటరీ అనుభవానికి అద్దం పట్టాయి. స్పీకర్ స్థానంలో ఆయన సభను నిర్వహించిన తీరును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా అభినందించారు.

## టి.కె శ్రీదేవిని మర్యాదపూర్వకంగా కలిసిన గుండు సుధారాణి

(హైదరాబాద్ -- పవర్):
తెలంగాణ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి మరియు సి.డి.ఎం.ఎ. శ్రీమతి టి.కె శ్రీదేవిని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (KUDA) చైర్‌పర్సన్‌గా నియమితులై పదవీ బాధ్యతలు చేపట్టిన శ్రీమతి గుండు సుధారాణి గారు మంగళవారం రోజున హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా శ్రీమతి టి.కె శ్రీదేవి కుడా (KUDA) చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించినందుకు గాను శ్రీమతి గుండు సుధారాణి గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.



## నూతన సీఐ బాబులాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులు



(ఆత్మకూర్ -- పవర్):
ఆత్మకూర్ పోలీస్ స్టేషన్‌కు నూతన సీఐగా బదిలీపై వచ్చిన బాబులాల్‌ను, బీజేపీ ఆత్మకూర్ మండల అధ్యక్షులు ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రజలు, పోలీసుల మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం కావాలని బీజేపీ నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ముత్యాల శ్రీనివాస్ గౌడ్, బలవంతుల రాజు, గట్టు వేణు గౌడ్, ఏదులాపురం శ్రావణ్ కుమార్, చౌల్లపల్లి సర్పంచ్ మోరే రాజేశ్వరరావు, భయ్యా పైడి, జక్కుల మహేందర్, వజ్ర రవికుమార్, పోరెడ్డి ప్రదీప్ రెడ్డి, వేములపల్లి శ్రీలత, మామునూరి శ్రీనివాస్, రాచర్ల నరేష్, బూర దశరథం, బత్తిని వీరస్వామి, మాదిరెడ్డి సురేందర్, కందికొండ ప్రవీణ్, పరికి దేవేంద్ర స్వామి, భయ్యా మాలగం శ్రీనివాస్ రెడ్డి, ఆవుల సాంబయ్యలతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరుపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

### మహిళా ఉద్యోగులు ఉన్న అసెంబ్లీలో చొక్కాలు విప్పుకుని అసభ్యంగా ప్రవర్తించడం సిగ్గుచేటు: ఎమ్మెల్యే యశస్విని రెడ్డి




(హైదరాబాద్ - పవర్):
తెలంగాణ అసెంబ్లీలో చోటుచేసుకున్న పరిణామాలపై తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో మహిళా ఎమ్మెల్యేలు తెలంగాణ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. పాలకుర్తి శాసనసభ్యురాలు శ్రీమతి మామిడాల యశస్విని రెడ్డి సహచర మహిళా ఎమ్మెల్యేలతో కలిసి మహిళా కమిషన్‌ను కలసి ఈ ఫిర్యాదు సమర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి దేవాలయంగా భావించే అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరు తీవ్రంగా బాధించిందన్నారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు, మహిళా ప్రజాప్రతినిధులు ఉన్న ప్రదేశంలో చొక్కాలు విప్పుకుని బహిరంగంగా నిరసన వ్యక్తం చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని, ఇది అత్యంత సిగ్గుచేటైన ఘటన అని ఆగ్రహం వ్యక్తం చేశారు.అసెంబ్లీ వంటి అత్యున్నత ప్రజాస్వామ్య వేదికపై సభ్యులు తమ నిరసనను ప్రజాస్వామ్య పద్ధతుల్లో వ్యక్తం చేయాలని, కానీ హద్దులు దాటి అసభ్యకరంగా ప్రవర్తించడం ప్రజాస్వామ్య విలువలకే విరుద్ధమని స్పష్టం చేశారు. అదేవిధంగా శాసనసభ స్పీకర్‌ను అసభ్యకరమైన పదజాలంతో దూషించడం మరింత బాధ కలిగించిందన్నారు. సభకు అధ్యక్షత వహించే స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్క శాసనసభ్యుడిపై ఉందని, రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత దూషణలకు దిగడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు.మహిళల గౌరవం, భద్రతకు సంబంధించిన అంశాలను తేలికగా తీసుకోకూడదని, అసెంబ్లీలో జరిగిన ఈ ఘటనపై సమగ్రంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్‌ను కోరినట్లు తెలిపారు. మహిళా సాధికారత, మహిళల గౌరవం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, మహిళలను అవమానించే ఎలాంటి ప్రవర్తననైనా సహించేది లేదని తేల్చి చెప్పారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో పాటు గ్రేటర్ వరంగల్ కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, పలువురు మహిళా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



# బ్లాక్ అండ్ వైట్‌లో క్లాసీ బ్యూటీ!



వింటేజ్ వైబ్స్‌లో వావ్ అనిపించిన శివాత్మిక

టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న నటి శివాత్మిక రాజశేఖర్ సోషల్ మీడియా లోనూ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులను అలరిస్తున్నారు. తాజాగా ఆమె షేర్ చేసిన బ్లాక్ అండ్ వైట్ ఫొటోలు వైరల్‌గా మారాయి. స్ట్రిప్డ్ అవుట్‌ఫిట్, వేవీ హెయిర్, మినిమల్ మేకప్‌తో క్లాసీ లుక్‌లో మెరిసిన శివాత్మిక.. సీరియస్ ఎక్స్‌ప్రెషన్స్‌తో ఆకట్టుకున్నారు. బ్లాక్ అండ్ వైట్ టోన్ ఫొటోలకు ప్రత్యేక వింటేజ్ టచ్‌ను తీసుకొచ్చింది. 'ఈజీ' అంటూ ఈ ఫొటోలను షేర్ చేయగా, అభిమానులు ఆమె స్టైల్, లుక్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రస్తుతం ఈ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# పర్పుల్ లుక్‌లో రెజీనా రచ్చ!

## ట్రెడిషనల్లోనూ సెగలే..

హీరోయిన్ రెజీనా కసాండ్రా మరోసారి తన గ్లామరస్ లుక్‌తో సోషల్ మీడియాలో సందడి చేసింది. పర్పుల్ కలర్ ట్రెడిషనల్ డ్రెస్‌లో కనిపించిన రెజీనా.. మెరిసే ఆభరణాలు, స్టైలిష్ బ్లౌజ్‌తో ఆకట్టుకుంది. వెండితెరపై తన నటనతో మెప్పించే ఈ భామ.. సోషల్ మీడియాలోనూ ఎప్పటికప్పుడు ఫ్యాషన్, గ్లామర్ ఫోటోలను షేర్ చేస్తూ అభిమా నులను అలరిస్తోంది. తాజాగా షేర్ చేసిన ఈ ఫోటోల్లో రెజీనా ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్, సింపుల్ పోజులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పర్పుల్ అవుట్‌ఫిట్‌కు సరిపోయేలా హెవీ జ్యువెలరీ ధరించి కనిపించిన రెజీనా.. ట్రెడిషనల్ లుక్‌కు మోడ్రన్ టచ్ ఇచ్చింది. ఫోటోలు చూసిన అభిమానులు 'హ్యాపీ మంగళవారం' అంటూ కామెంట్లు చేస్తూ తమ అభిమానాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# పచ్చని చీరలో కల్పిక పరవశం!

## క్లాసీగా ఉందంటున్న అభిమానులు

సినిమా డెస్క్, ఆంధ్రప్రభ:నటి కల్పిక తన తాజా ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. పచ్చని రంగు శారీలో సంప్రదాయ లుక్‌లో కనిపించిన ఆమె.. మ్యాచింగ్ బ్లౌజ్, మెడలో అందమైన నెక్లెస్, చెవులకు జుంకాలు, చేతులకు గాజులతో ఆకట్టుకు న్నారు. నుదుటిన బొట్టుతో మరింత ట్రెడిష నల్‌గా కనిపించారు. ఇంట్లోని అందమైన ఇంటీరియర్ బ్యాక్‌డ్రాప్‌లో చిరునవ్వుతో, సింపుల్ పోజుల్లో ఫొటోలకు స్టిల్ ఇచ్చారు. సహజమైన అందం, సంప్రదాయ వస్త్రధార ణతో కల్పికలుక్ అభిమానులను ఆకట్టుకుం టోంది. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో.. "చాలా అందంగా ఉన్నారు", "ట్రెడిషనల్ లుక్‌లో అదిరిపో యారు" అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.



లేడీ పవర్‌స్టార్ సాయి పల్లవి ప్రస్తుతం బాలీవుడ్‌తో పాటు దక్షిణాది చిత్రాల్లోనూ వరుస అవకాశాలు అందుకుంటు న్నారు. తాజాగా మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కుతున్న కొత్త చిత్రంలో విజయ్ సేతుప తితో కలిసి నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ జరుగు తున్న ఈ చిత్రానికి 'ఇంజి వెల్లం' అనే టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. విడుదల చేసిన టైటిల్ పోస్టర్‌లో వర్షంలో తడుస్తూ సాయి పల్లవి, విజయ్ సేతుపతి కనిపించిన తీరు ఆక ట్టుకుంటోంది. పోస్టర్‌ను బట్టి ఇది మణిరత్నం మార్క్ ప్రేమ, భావోద్వేగాలతో కూడిన రొమాం టిక్ డ్రామాగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ కథ కోల్‌కతా నేపథ్యంలో సాగుతుందనే ప్రచారం కూడా జరుగుతోంది.



# మణిరత్నం ఇంజి వెల్లం

## సాయి పల్లవి–విజయ్ సేతుపతి రొమాన్స్!



# అల్ట్రా స్టైలిష్‌గా శృతిహాసన్

లేటెస్ట్ ఫొటోలు నెట్టింట వైరల్ కాన్ఫిడెంట్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకున్న శృతి ఫొటోలకు ప్రశంసల వెల్లువ

విలక్షణ నటుడు కమల్‌హాసన్ కుమార్తెగా సినీ రంగంలోకి అడుగుపెట్టిన శృతిహాసన్.. హీరోయిన్‌గా, గాయనిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. తెలుగు, తమిళ, హిందీ చిత్రాల్లో నటిస్తూ అభిమానులకు చేరువయ్యారు.తాజాగా శృతిహాసన్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోలు వైరల్‌గా మారాయి. అల్ట్రా స్టైలిష్ డ్రెస్‌లో, ట్రెండీ హెయిర్‌స్టైల్, సింపుల్ మేకప్‌తో ఆమె ఆకట్టుకున్నారు. గ్లామర్‌తో పాటు కాన్ఫిడెరిట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో మెప్పించిన ఈ ఫొటోలకు అభిమానులు 'స్టన్నింగ్', 'అల్ట్రా స్టైలిష్', 'ఎవర్‌గ్రీన్ బ్యూటీ' అంటూ ప్రశంసలు కురిపి స్తున్నారు. ప్రస్తుతం ఈ పిక్స్ నెట్టింట సందడి చేస్తున్నాయి.



# కావ్య ఇంట్లో పెళ్లి బాజాలు

## చేతుల నిండా గోరింటాకు.. ఇంటి మొత్తం పూల అలంకరణ..

చైల్డ్ ఆర్టిస్ట్‌గా సినీ ప్రయాణం ప్రారంభించి, 'బలగం' సినిమాతో హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న కావ్య కళ్యాణ్‌రామ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారారు. 'ఉస్తాద్' సినిమా సమయంలో సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి కుమారుడు కాలభైరవతో ప్రేమలో ఉన్నట్లు ఇటీవల అధికారికంగా ప్రకటించిన ఆమె.. తాజాగా లంగా వోణీలో మెరిసిన ఫొటోలను పంచుకున్నారు. చేతులు, కాళ్లకు గోరింటాకు పెట్టుకోవడంతో పాటు ఇంటిని పూలతో అలంకరిస్తూ, తన అమ్మమ్మకు మెహందీ పెడుతున్న చిత్రాలను షేర్ చేశారు. దీంతో "కావ్య ఇంట్లో పెళ్లి సందడి మొదలైందా?" అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.



# హాట్ లుక్‌లో అనన్య

తెలుగు నటి అనన్య నాగళ్ల తన లేటెస్ట్ ఫొటోలతో సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. బ్లాక్ కలర్ షార్ట్ డ్రెస్‌లో స్టైలిష్‌గా కనిపించిన ఆమె.. వేవీ హెయిర్, రెడ్ లిప్‌స్టిక్, హైహీల్స్‌తో గ్లామరస్ లుక్‌లో ఆకట్టు కున్నారు. గోడకు ఆనుకుని కాన్ఫిడెంట్‌గా ఇచ్చిన పోజులు ఫ్యాన్స్‌ను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఈ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి.